క్లుప్తంగా

తిరుపతి శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.1,88,431 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 11 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 2,500 మంది భక్తులకు అన్నదానం చేసినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, సర్పంచ్ మొయిళ్ల కష్ణ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ క్లబ్ వారోత్సవాలు

సామర్లకోట: వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు కెసీ గుప్తా జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్లా రామకృష్ణ సూచనల మేరకు ఈనెల 1న ప్రారంభమైన వారోత్సవాలు ఆదివారంతో ముగియనున్నట్టు వనితా వాసవీ క్లబ్ అధ్యక్షురాలు కంచర్ల సుష్మా మోహిని, కార్యదర్శి కంచర్ల మహాలక్ష్మి, కోశాధికారి కంచర్ల లలిత, మహిళా ఉత్సవ కమిటీ ఇన్‌చార్జి కటకం హైమావతి తెలిపారు. శనివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో స్థానిక పాత్రికేయుల సంఘ ప్రతినిధులు సత్కరించారు. ఆదివారం స్థానిక మానసిక దివ్యాంగుల కేంద్రంలో సేవలందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ కటకం రత్నకుమారి, రీజనల్ చైర్మన్ కడిమిచర్ల భాను, జోన్ చైర్మన్ కటకం పద్మరత్నం, స్థానిక క్లబ్ సహాయ కార్యదర్శి కంచర్ల రాజీ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో బాలికకు గాయాలు



కుక్క దాడిలో గాయాల పాలైన చిన్నారి దుర్గ

పెద్దాపురం: పట్టణంలో పిచ్చి కుక్క స్వైర్య విహారం చేసి చిన్నారిని గాయపర్చిన ఘటన శనివారం పెద్దాపురం తోట వీధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తాడితోటకు చెందిన పి.లక్ష్మి దుర్గ (6) చిన్నారి సమీపంలోని కిరాణా కొట్టుకు వెళ్లి తిరిగి వస్తుండగా పిచ్చి కుక్క దాడి చేసి ఈడ్చుకెళ్లింది. స్థానికులు పాపను రక్షించగా అప్పటికే చిన్నారి తీవ్ర గాయల పాలవ్వడంతో కుటుంబ సభ్యులు పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చిన్నారిని తరలించారు. పట్టణంలో కుక్కల బెడద అధికమైందని, అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డ్రోన్‌తో కషాయాల పిచికారీ

గోకవరం: మండలంలోని ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి పంటలకు ఆశించే తెగుళ్ల, పురుగులను అరికట్టేందుకు డ్రోన్ సాయంతో కషాయాలను పిచికారీ చేయిస్తున్నట్టు ఎంటీఎల్ బసవన్న గౌడ్, దేవి, సౌజన్య తెలిపారు. మండలంలోని రంపయర్రంపాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మాదాసు సత్యనారాయణ, అడపా రామకృష్ణ, వానపల్లి హరిబాబు, తదితర రైతులకు చెందిన 20 ఎకరాల వరి చేలుపై దశపర్ని కషాయం, పాల ఇంగువ, చేపబెల్లం ద్రావణం కలిపి పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

కోటనందూరు: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పి.వెంకటనారాయణ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కౌశలం, మన మిత్ర, వాట్సాప్ గవర్నెన్స్ సర్వేల తీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు ప్రయోజనకారి అజొల్లా

- పాడి పంటలకు ఎంతో ఉపయోగం
- పాడి గేదెలకు దాణాగా వినియోగం
- రిలయన్స్ ఆధ్వర్యంలో 18 మండలాల్లో సాగు



పెద్దాపురం: వ్యవసాయ పనులకు కూలీల రేట్లు పెరగడం, కూలీలు దొరకకపోవడం, వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగం వల్ల ఎండుగడ్డి, కలుపు మందుల వల్ల పచ్చగడ్డికి కొరత ఏర్పడింది. ఇలాంటి సందర్భంలో పాడి రైతులకు 'అజొల్లా' ఒక వరంలా మారింది. పెరిగిన దాణా ఖర్చులు కూడా పశుపోషణకు కష్టంగా మారిన సమయంలో అజొల్లా వల్ల ఉపయోగాలు తెలపడానికి, పాడి పంటలకు అజొల్లా ఆవశ్యకతను తెలుపుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 18 మండలాల్లో సుమారు 3,500 మంది రైతులను ఎంపిక చేసి వారికి శిక్షణనిచ్చారు. రైతులు అజొల్లా సిద్ధం చేసి, పశువులకు మేతగా, ఎరువుగా వినియోగిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వ్యవసాయం, పశువులు, జీవాలు, కోళ్ల పెంపకంలో 'అజొల్లా' రైతులకు ఎంతగానో ఉపకరిస్తోంది. నాచు జాతికి చెందిన అజొల్లా ఇంటి ఆవరణలోనే అత్యంత సులభంగా పెంచుకునే అవకాశం ఉంది. పశుసంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్), రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం జి.రాగంపేట, గోరింట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, గోకవరం, కరప, పెదపూడి, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవు, తుని, రౌతులపూడి, అమలాపురం రూరల్, ఐనవిల్లి, ముమ్మిడివరం, కోరుకొండ, అడ్డతీగల, రాజ ఒమ్మంగి, రంపచోడవరం మండలాల్లో అజొల్లాపై ప్రచారం విస్తృతంగా చేపట్టారు. పెంపకం చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు.

రైతులకు అవగాహన కల్పించాం



అజొల్లా ప్రతి రైతు ఇంట్లో పెంచుకోవాలి. దీని వల్ల రైతులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం అవసం ఉండదు. కాస్త శ్రద్ధ తీసుకోవాలి. అజొల్లా పెంపకంపై 18 మండలాల్లోని రైతులకు అవగాహన కల్పించాం. సాగుకు రైతులకు సలహాలు అందిస్తున్నాం. కేవలం రూ.1000 పెట్టుబడితో నిరంతరాయంగా అజొల్లా తయారవుతుంది. రైతులు కూడా అజొల్లా పెంపకంపై ఆకర్షిలవుతున్నారు.

– బర్రే నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్, రిలయన్స్ ఫౌండేషన్, గోరింట, పెద్దాపురం మండలం

పెంచుకునే విధానం

అజొల్లా పెంపకానికి కావలసిందల్లా కొన్ని సిమెంటు లేదా మామూలు ఇటుకలు, ఓ టార్పాలిన్ పట్టా, తాగునీరు, పది కేజీల పశువుల పేడ, 200 కేజీల సారవంతమైన మట్టి, ఒక కేజీ అజొల్లా అవసరమవుతుంది. వీటి కోసం రైతులు ఖర్చు చేయాల్సింది కేవలం రూ.1000. సిమెంటు ఒరలు లేదా ఇటుకలతో తయారు చేసుకున్న తొట్టెలతో అజొల్లా పిట్‌ను తయారు చేసుకోవచ్చు. గ్రామంలో ఎవరైనా దీనిని పెంచుతుంటే వారి వద్ద నుంచి కొద్దిగా అజొల్లా కల్చర్‌ను తెచ్చుకుని తయారు చేసుకున్న పిట్‌లో వేస్తే చాలు జీవిత కాలం అజొల్లా పెరుగుతూనే ఉంటుంది. అవసరాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఎన్ని అజొల్లా పిట్లనైనా తయారు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు

- అజొల్లాను ఇంటి వద్దే పెంచుకోవచ్చు. పెంపకం కూడా సులువే.
- ఆవులకు, గేదెలకు, మేకలకు, కోళ్లతో పాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- ప్రతి రోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున పాలిచ్చే పశువుకి దాణాగా పెట్టడం వల్ల దాణా ఖర్చు తగ్గడమే కాకుండా పాల దిగుబడి పెరుగుతుంది, వెన్న శాతం పెరుగుతుంది. దీనిలో ప్రొటీన్లు, మాంసకృత్తులు అధికంగా ఉండడం వల్ల పశువు బలిష్ఠంగా ఉంటుంది. పశువులు సమయానికి ఎదకి వస్తాయి. దీని వల్ల పశు సంపద పెరుగుతుంది.
- వరి పైరుకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. అజొల్లాను వరి పొలంలో వేసుకోవడం వల్ల ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.
- అజొల్లాను పొలంలో వేయడం వలన మొక్క వేర్లకు ఆక్సిజన్ తగినంత అందుతుంది. ఫలితంగా యూరియా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- పొలం నిండా అజొల్లా ఉండటం వల్ల నీరు త్వరగా ఆవిరి కాదు. ఫలితంగా నీటి తడులు అందించాల్సిన అవసరం చాలా తగ్గుతుంది.
- వరి పంటలో కలుపు రాకుండా అడ్డుకోవడంలో అజొల్లా ఎంతగానో ఉపయోగపడుతుంది.



కోళ్లకు మేతగా అజొల్లా

ఎరువుల స్టాక్ పాయింట్ల తనిఖీ



సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీలోని కోరమండల్ గోదాములో ఎరువులను తనిఖీ చేసిన అధికారులు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని జి.మేడపాడులో కోరమండల్ ఇంటర్ నేషనల్ ఎరువుల గోదాములను శనివారం వ్యవసాయశాఖ, విజిలెన్సు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో భౌతిక నిల్వలకు స్టాక్ రిజిస్టర్లకు ఎటువంటి వ్యత్యాసం లేదని మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. కోరమండల్ స్టాక్ పాయింట్‌కు ఆథరైజేషన్ పత్రాలు చూపలేదని చెప్పారు. దీంతో స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఎరువుల అమ్మకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఆదేశించామని చెప్పారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ స్పెషల్ బ్రాంచి సీఐ గోపాలరావు, తహసీల్దార్ కె.విజయకుమార్, వ్యవసాయశాఖ విస్తరణాధికారి ఎం.శాంతికమల పాల్గొన్నారు.

నేడు అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ

సామర్లకోట: రైతులకు ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలం కావడంతో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రైతులకు అండగా నిలవాలని నిర్ణయించిందని నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నిమిషాలకు సామర్లకోట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని దొరబాబు పిలుపు నిచ్చారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు



నాటక రంగానికి విశేష కృషి చేసిన ఆచార్య బీవీ రమణమూర్తిని సత్కరిస్తున్న ప్రముఖులు

బోట్‌క్లబ్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమెరికన్ కామెడీ నాటిక పోటీలు శనివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా చిరంజీవిని కుమారి కళాప్రాంగణాన్ని విశిష్ట అతిథిగా హాజరైన సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రారంభించారు. ముఖ్య అతిథి ఉప్పులూరి సుబ్బరాయశర్మ, తనికెళ్ల భరణి జ్యోతి ప్రజ్వలన చేసారు. యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కర్ సభకు అధ్యక్షత వహించారు. వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాల క్రితం తాను రాసిన 30 హాస్య నాటికల నుంచి 5 నాటికలను ఎంపికచేసి రెండురోజుల పాటు దంటు కళాక్షేత్రంలో ప్రదర్శిస్తారని తెలిపారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ చిట్టెన్ రాజు అమెరికాలో ఉంటూ, మన సంస్కతి, సంప్రదాయాలను మర్చిపోకుండా, అనేక సాహితీ సదస్సులను నిర్వహిస్తూ తెలుగుభాషా సాహిత్యాలకు ఇతోధిక సేవలందించడం అభినందనీయమన్నారు. వేదికపై తనికెళ్ల భరణి చేతులమీదుగా 5 పుస్తకాలను ఆవిష్కరించారు. నాటక రంగానికి విశేష కృషి చేసిన ఆచార్య బీవీ రమణమూర్తి (మార్గశీర్ష), ఆచార్య డీఎస్ఎన్ మూర్తిని యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్ తరపున సత్కరించారు. హైదరాబాదుకు చెందిన మహతి క్రియేషన్స్ కళాకారులు యమసభ, శ్రీజయ ఆర్ట్స్ వారు మగ పాత్ర లేని నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. కె.కృష్ణారావు, మార్ని జానకిరామ చౌదరి, సుచిత్రామూర్తి, పి.ప్రభుదాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

11న 'రెడ్ రన్'

కాకినాడ క్రైం: లైంగిక సంక్రమణ వ్యాధులు, హెచ్ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కోసం ఈ నెల 11న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రెడ్ రన్ పేరుతో 5కే మారథాన్ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ శనివారం ఓ ప్రకటన పేర్కొన్నారు. 17–25 ఏళ్ల మధ్య ఉన్న విద్యార్థులు, యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కాకినాడ కుళాయి చెరువు వద్ద ఉన్న వివేకానంద గేటు వద్ద ఉదయం 6.30 రెడ్ రన్ ప్రారంభం అవుతుందని అన్నారు.

జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు మూడు ప్రత్యేక ట్రాక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన అభ్యర్థికి రూ.7 వేలు చొప్పున రివార్డులు ఇస్తామన్నారు. గెలుపొందిన అభ్యర్థులను రాష్ట్రస్థాయి పోటీకి పంపిస్తామని అన్నారు. వివరాల కోసం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బాలాజీని 9949495022 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో మానిటరింగ్ కమిటీ సమావేశం

సామర్లకోట: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖాధికారి వి.మురళీధర్ తెలిపారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పి.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్, పోలీసు, వ్యవసాయశాఖల సహకారంతో గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నామని ప్రత్యేకాధికారి తెలిపారు. రైతులకు ఎరువులు సక్రమంలో అందే విధంగా పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ప్రైవేటు డీలరు వద్ద గ్రామ వీఏఓ, సచివాలయ ఉద్యోగిని నియమించి ఎరువుల విక్రయంలో అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసున్నట్టు ఆయన చెప్పారు. తరచూ ప్రైవేటు డీలర్ల షాపులను తనిఖీ చేస్తామన్నారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతులకు 3,034 మెట్రిక్ టన్నుల ఎరువులు కావలసి ఉండగా 2,698 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మిగిలిన 336 మెట్రిక్ టన్నులు ఒకటి, రెండు రోజుల్లో స్టాక్ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఏఎస్సై జి. శ్రీనివాసు, మండల ప్రజాపరిషత్తు ఏఓ సతీష్‌బాబు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో జేఎన్‌టీయూకేకు ప్రత్యేక గుర్తింపు



అధ్యాపకులను సత్కరిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందని వీసీ, ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు.జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ 11 జిల్లాలో 164 ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలలు ఉన్నాయని, అనుబంధంగా 2,30,000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, క్లీన్ ఎనర్జీ, అంతరిక్ష పరిశోధన, బయోటెక్నాలజీ వంటి రంగాలు దుసుకెళ్తున్న తరుణంలో వాటికి అనుగుణంగా విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు.అనంతరం అధ్యాపకులు, విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ కోటేశ్వరరావు, రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా

- వైభవంగా గణేశ్ నిమజ్జనాలు
- కళకళలాడిన సాగరతీరం
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



ఉప్పాడ సాగర తీరంలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉప్పాడ, కోనపాపపేట సాగరతీరంలో శనివారం గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. సుమారు 400లకు పైగా విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ నిమజ్జనాలతో సాగరతీరం కళకళలాడింది. మండలంలో కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాల్లో ఊరేగించారు. కొత్తపల్లితో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా తీసుకొచ్చి ఉప్పాడ సాగరతీరంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులను ఇచ్చారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తుల తాకిడితో బీచ్ రోడ్డు కిక్కిరిసిపోయింది. ఉపాడ నుంచి కాకినాడ వరకూ తీరం వెంబడి ఎక్కడ చూసినా పర్యాటకులతో కళకళలాడింది.

ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. మండలంలోని మర్లావ గ్రామంలోని శనివారం గణేశ్ నిమజ్జనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం వందల మంది గ్రామస్తులతో కలసి గ్రామంలో వినాయకుడి గ్రామోత్సవం నిర్వహించి స్థానిక ఏలేరు నదీలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



స్వామివారి ఊరేగింపులో భక్తుల సందడి

వాకతిప్పలో అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని భక్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కొత్తపల్లి, కుతుకుడుల్లి, ఉప్పాడ గ్రామాలకు చెందిన సుమారు 3 వేలు మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సామర్లకోట గోదావరి కాలువలో క్రేన్ సాయంతో గణేశ్ నిమజ్జనం

ప్రశాంతంగా గణపతి నిమజ్జనాలు

- పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ
- నృత్యం చేస్తూ యువత సందడి

సామర్లకోట: మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసుశాఖలకు చెందిన త్రిసభ్య కమిటీ సభ్యులతో ఎటువంటి అవాంచనీయమైన సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా స్థానిక గోదావరి కాలువలో గణేశ్ నిమజ్జనాలు శనివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈనెల 7న ఆదివారం చంద్రగ్రహణం రావడంతో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు శనివారం నిమజ్జనాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం ఉదయం 11 గంటల వరకు నిమజ్జన ప్రదేశం వద్దకు క్రేన్ రాకపోవడంతో కొంత సమయం అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో క్రేన్ ఏర్పాటు చేశారు. ఐదు అడుగులు దాటి ఉన్న విగ్రహాలను క్రేన్ సహాయంతో గోదావరి కాలువలో నిమజ్జనం చేస్తున్నారు.పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. శనివారం అర్ధరాత్రి వరకు నిమజ్జనాలు కొనసాగే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో విద్యుద్దీపాలు ఏర్పాట్లు చేశారు. పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాలతో పాటు పెద్దాపురం మున్సిపాలిటీ, జి. రాగంపేట ప్రాంతాల నుంచి గణేశ్ విగ్రహాలను ఊరేగింపుగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవు వద్దకు చేరుకున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. పీబీ దేవం, జి. మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, వీకే రాయపురం, బోయనపూడి, మాధవపట్నం గ్రామాలకు చెందిన గణపతి విగ్రహాలను ఆయా గ్రామాల పరిధిలోని గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. అచ్చంపేట, గొంచాల, నవర, చంద్రంపాలెం గ్రామాలకు చెందిన వారు ఏలేరు కాలువతో పాటు పీబీసీలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గోదావరి కాలువ వెంబడి ఉన్న గ్రామాల వద్ద ఎఎస్సైలు, హెచ్‌సీల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గణేశ్ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



సామర్లకోటలో గణేశ్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు



గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



ట్రాక్టర్‌పై గణేశ్ విగ్రహం తరలింపు



కొత్తపల్లిలో భక్తుల కొలాహలం



మర్లావలో గణపతి గ్రామోత్సవంలో రథాన్ని మోస్తున్న వైస్ ఎంపీపీ రాజా తదితరులు